
# కథలాంటి నిజం

యర్రంశెట్టి శాయి



ల్లాంటిచిన్న స్టేషను. ఆరోజు ట్రైన్‌లో దిగింది నేనూ,సుభద్ర మరి ఇద్దరు ప్రయాణీకులు. మమ్మల్ని ఆ స్టేషనులో వదిలి రివ్వుమంటూ వెళ్ళిపోయింది బండి. మేమా ఈస్టేషనుకి రావడం ఇదే ప్రథమం.ప్రతి సంవత్సరం ఏదయినా అడవికెళ్ళి వేటాడటం నాకుసరదా! ఎప్పుడూలేనిది ఈసారి సుభద్రకూడా నాతోవస్తానని పట్టుబట్టింది. ఈసంవత్సరం లేళ్ళ వేటాడాలని సరదా కలిగింది. మిత్రుల నడిగితే చాకూర్ అనే స్టేషను దగ్గర జింకలు, లేళ్ళు బాగా తిరుగుతూంటాయని చెప్పారు.

ప్లాటుఫారం అంతా తేరపార చూశాము. స్టేషను వెనుక రెండుమూడు రైల్వేక్వార్టర్సు తప్పితే మరో ఇల్లు లేదు. జనసంచారమూ లేదు. బుకింగ్ ప్రక్కనే తుపాకీవుంది మెల్లగా స్టేషనువేపు నడిచాము.

"అబ్బ! ఇంతనిర్మానుష్యమైనచోట ఈ రైల్వేవాళ్ళు ఎలావుంటారో", అందిసుభద్ర.

"హాయిగా వుంటారు! వాళ్ళకేం?" అన్నాను నేను నవ్వుతూ.

స్టేషనులోపల బల్లముందు ఓ యువకుడు కూర్చునివున్నాడు. వయస్సుఇరవై మూడు సంవత్సరాలుండవచ్చు. ఏదేకదీక్షతో ఏదో చిత్రం గీస్తున్నాడు. మారాకను గమనించనే లేదు. నేను మెల్లగా దగ్గి "మేఐ కమిన్ ప్లీజ్" అన్నాను. ఉలిక్కిపడ్డాడతను. మమ్మల్ని చూచి ఆశ్చర్యపోయాడు. మరుక్షణంలోనే తేరుకొని "యస్, కమిన్ కమిన్!" అన్నాడు కుర్చీలో నుంచి లేస్తూ.

"బైఠియే" అన్నాడు హిందీలో, మా వంకే చూస్తూ.

"థాంక్స్! అన్నట్లు, మీకుతెలుగు వచ్చా?" అడిగాను నేను.

"ఓ! తెలుగు రాకపోవడ మేమిటండీ మీకురాదేమోనని హిందీలో మాట్లాడాను. ఇది మహారాష్ట్ర దేశంకదా!మిమ్మల్ని తెలుగు వాళ్ళనుకోలేదు. అన్నట్లుమీపేరు?" ప్రశ్నించాడు.

"విశ్వనాథ్! ఈమె సుభద్ర! నా వైఫ్!"

"వెరీ గ్లాడ్ టుసీయూ, నాపేరు నాగేం

దర్!" అన్నాడతను.

మాటల్లో నేను వచ్చిన విశేషం చెప్పాను.

"అట్లాయితే! మీరు రేప్పొద్దుటి వరకూ ఆగాలి!"అన్నాడతను

"రాత్రికి వాఆతిథ్యం తీసుకొంటే చాలా సంతోషిస్తాను!" తిరిగి అన్నాడతను

"మీరేమీ శ్రమ తీసుకోకండి! మేము టిఫిన్ కారియర్ తెచ్చాము" అన్నాను నేను

"దట్సాల్ రైట్!" నవ్వుతూ అన్నాడతను

"అన్నట్లు మీరు చిత్రకారులను కొంటాను!"

కొద్దిగా ఆగి అన్నాడతను "ఒకప్పుడు!"

"అదేమిటి?" ప్రశ్నార్థకంగా చూశాను నేను

"అవునండి, ఒకప్పుడు నాచిత్రాల్లో జీవం వుండేవి ఇప్పుడులేదు కారణంఈ ఉద్యోగం!"

"ఎందుకని?" అడిగాను

"ఏ ఎస్ ఎమ్ అంటే ఎప్రాప్రియేట్ మీనింగ్ మీకుతెలుసా?"

"అసిస్టెంటు స్టేషన్ మాస్టరు అనుకొంటాను?"

"అవును! అది అసలు అర్థం! కాని దానికితగిన అర్థం ఎయిమ్‌లెస్ సీయింగ్ మిషన్ అని! రాత్రి, పగలు తేడాలేకుండా తనపని తను చేసుకు పోయే మిషన్‌అది!"

గట్టిగా నవ్వేశాను నేను సుభద్రకూడా నవ్వాక వూరుకోలేక పోయింది

"ఓచిన్నకథ వింటారా?" అడిగాడతను "విజ్ఞానికది కథకాలేదు నిజమైనసంగతే!"

"ఓ చెప్పండి! "అన్నానుకుతూహలంగా

"పూర్వం భారతదేశంలో అనేకమంది మునులు అరణ్యాల్లో తపస్సు చేసుకుంటూండేవారు. కాని వాళ్లు పూర్తిగా తమ తపస్సులో మునిగిపోయేవాళ్లు కాదు. ఓకంట తమచుట్టూ ఏంజరుగుతుందీ చూస్తూనే వుండేవాళ్లు! అందమయిన అమ్మాయిలు కనబడితే కొంతమంది ప్రేమించి అమాంతం పెళ్లాడేశారు కూడా. ఇలా వుండగా ఓరోజున భగవంతుడికి వీళ్లదంతా కపట తపస్సేమో అని ఓ అనుమానం వచ్చింది రావడమేతడవుగా, ఆరోజు (బెడ్ కాఫీలా) బెడ్ అమృతం దొరకలేదేమో, మాంచి కోపంగా వున్నాడేమో, ఎడ్వాన్సుశాపం ఇచ్చి పారేశాడు. ఏమని? 'మీకు మోక్షానికి ఇవ్వట్లో వేకెన్సీలేదు కలియుగంలో జన్మించండి ఆతరువాత ఏమయినా ఖాళీలుంటే చూస్తాను' అని ఆతరువాత ఆయన మునులను బాధపెడుతూ రాక్షసులందరినీ, ప్రైవేటు మీటింగుతో పిలిపించి "ఒరే రాక్షసులూ! మీరు చాలా మంచివారు మిమ్మల్ని ప్రజలు తిట్టినా మీరేం ఫీలవ బోకండి. అరణ్యాల్లో మునులు నన్ను ప్రార్థించుకొంటున్నారు మీరు లేకపోతె నన్ను తలచే వాడెవడు? మీరు ఇంతసహాయం చేసి నందుగ్గాను మీరుమళ్లీ కలియుగంలో ఇదే గ్రేడ్‌లో పుట్టి నన్ను ప్రజలు అప్పుడు కూడా స్మరించు కొనేట్లు చేయండి" అని చెప్పాడు

సుభద్ర నవ్వేస్తోంది

"ఇంతకీ ఈకలియుగంలో మునులెవ్వరు? రాక్షసులెవరు?"

"ఇంకెవరు! మునులందరూ వెంటనే కలియుగంలో అసిస్టెంటు స్టేషన్‌మాస్టర్లుగా పుట్టేశారు పూర్వజీవితంలా అడవుల్లోనే వుద్యోగాలు (తపస్సు కంటిన్యూ చేయడానికి) వాళ్లపిల్లలు చదువుల్లేక పోవడం మూలాన (అడవుల్లో స్కూళ్లు వుండవుగా) నిజంగానే సన్యాసులవుతున్నారు తండ్రుల పూర్వజన్మ కీర్తి నిలబెడుతున్నారు ఇక రాక్షసులు దేముని దీవెన ప్రకారం మళ్లీ మునుల్ని బాధించడానికి వాళ్లమీదు ఆఫీసరులయి పుట్టేశారు

ఇదీకథ' కాబట్టి పూర్వజన్మలో నేనో మహామునిని!"

సుభద్ర, నేనూ నవ్వేస్తున్నాము

"మీకు వివాహం అయిందా?"ప్రశ్నించాను నేను

"ఎలా అవుతుంది?"

"అదేమిటి?"

"అంతేమరి! ఇది మరోచిన్న స్కెచ్‌లాంటిది. కథకాదులెండి, నేనీ ఉద్యోగంలోకి రాకముందు, నేనూ మాకాలేజీలోనే చదువుతూన్న (మా బంధువులమ్మాయేలెండి!) ఓ అమ్మాయి (ప్రైవేటుగా ప్రేమించుకొన్నాం ఇద్దరం పెళ్లిచేసుకోవాలని బోలెడు సినీవాగ్దానాలు కూడా చేసుకొన్నాం! అంతే! నేనీ వుద్యోగంలో ప్రవేశించాను ఆఅమ్మాయి ససేమిరా నువ్వు నాకొద్దని కూర్చుంది 'నన్ను పెళ్లాడాలంటే ఈఉద్యోగం వదిలెయ్'మంది. అడవుల్లో జీవితం గడపాలంటే నావల్లకాదని కుండపగలగొట్టినట్లు (నిజంగా ఆసమయంలో ఆవిడకాలు తగిలి కుండ పగిలిపోయింది) చెప్పింది ఆఖరికి నువ్వు నన్ను పెళ్లిచేసుకోకపోయినా ఫరవాలేదంది"


"ఎందుకనిట?"

"ఎందుకేముంది! వాళ్లింటి ప్రక్కన వాటాలో ఒక ఎ ఎస్ ఎమ్ అద్దెకుండే వాడుట అతని భార్య రోజూ అతనితో 'నేనీ ఇంట్లో ఒక్కర్తెనే వుండలేను మీరు ఎప్పుడూ రాత్రి డ్యూటీకి పోతారెందుకు. లక్ష్మమ్మగారి మొగుడూ, విమలమ్మగారి భర్తా ఎప్పుడూ రాత్రిళ్లు ఇంట్లోనే వుంటారు చక్కగా సాయంత్రంపూట సినిమాకుగాని, బజారుగాని పోతూంటారు భార్యల్ని వెంటేసుకొని! పూరిపాడుఉద్యోగంలో మంచి ఎందుకు వచ్చెయ్యరు.? అంతకష్టంగా వుంటే నన్ను పుట్టింటికి పంపించెయ్యండి ' అని గోలపెడుతూండేదిట. ఆమాటలు ఈఅమ్మాయి చెవిని బడినయి మొన్నే ఉత్తరం వ్రాసింది అలా అని!"కాని ఇక్కడికొచ్చాక నాకు పెళ్లవకపోతేనే మంచిదేమో అని పించిందినాకు!"

"ఎందుకని?" విస్తుపోయాను

"ఎందుకనేమిటి? సపోజ్ పెళ్లయిందనుకోండి! భార్యతో ఎక్కడ కాపరం వుండాలి? కొన్ని స్టేషన్లలో వుండటానికి ఇళ్లులేవు ఇక్కడా అదేపరిస్థితి. రావణాసురుడుకూడా సీతని క్వార్టర్సు ఖాళీలేక అశోకవృక్షం కింద బందీచేశాడు. అలాగే ఆ చింత చెట్టుక్రింద నా భార్యని ఉండమనాలి"

"మరి మీ రిప్పుడు ఉండటం ఎక్కడ"?




## కథలాంటి నిజం

"ఇంకెక్కడ? ఇక్కడే! ఈ టేబుల్ నుంచి ఇటు ప్రక్క డ్రాయింగ్‌రూమ్! అటు ప్రక్క బెడ్‌రూమ్! అంటే మీ రిప్పుడు నా బెడ్‌రూమ్‌లో కూర్చుని మాట్లాడుతున్నారన్నమాట! ఆ మూల రెండు గజాలు స్థలం కిచెన్! బయట కామన్ బాత్‌రూమ్. "ఇల్లూ కమ్.... ఆఫీసూ ఇది"

ఎంత నవ్వువస్తున్నా నాకు కొద్దిగా జాలి కూడా కలిగింది అతనిమీద.

బాగా చీకటి పడిపోయింది అతనింకా ఏవేవో మాట్లాడుతూనే ఉన్నాడు సుభద్రకతని మాటలు తమాషాగా ఉన్నవి. నవ్వుతూ వింటోంది.

"ఇక భోజనం చేస్తామంటారా?" అడిగాను నేను.

"ఓ యస్ అలాగే" అని బలరామ్ ఎవర్నో పిలిచాడు

ఓ యువకుడు పరుగుతో వచ్చాడు. "ఏంసార్?" అంటూ

"ఆ పెట్టెమీద నా భోజనం కారియర్ వుంది తీసుకురా! ప్లేట్లు అవీ అన్నితే!" అంటూ టేబుల్‌మీద పుస్తకాలన్నీ తీసి వేశాడు.

"ఇది హోమార్ ఆఫీస్ టేబుల్! ఇప్పుడు డైనింగ్!" అన్నాడు నవ్వుతూ. సుభద్ర మేము తెచ్చిన టిఫిన్ కారియర్ ప్లేట్లు బల్లమీదకు తెచ్చింది బలరామ్ కూడా అతని భోజనం తెచ్చాడు. సుభద్ర అందరికీ వడ్డిస్తోంది.

"చూడండి సిస్టర్! మీరు కూడా భోజనం చేసెయ్యండి!" అన్నాడు అతను.

"అవును సుభద్రా! నువ్వూ కూర్చో!" అన్నాను.

అతని భోజనం నాలుగు చపాతీలూ, కొద్దిగా కూరానూ. అన్నం అసలులేదు. అదే అడిగాను నేను.

"ఓ బియ్యం సంగతి చాలాకాలం క్రిందట మర్చిపోయాను! ఇక్కడ అలాంటి పదార్థమేమీ దొరకదు. ఇంటి దగ్గర నుంచి తెచ్చుకొందామా అంటే [illegible]"

సుభద్ర అతనికి అన్నం వడ్డించ బోయింది

"హో వద్దండీ అక్కయ్యగారూ! మళ్ళా రుచి చూశామంటే తర్వాత రోజూ అన్నమే తినాలనిపిస్తుంది!" అంటూ వారించా డతను.

అయినా సుభద్ర వినిపించుకోలేదు

"అబ్బ! మీరు చాలా చక్కగా వంట చేస్తారు సిస్టర్!" అని, "మీరు చాలా అదృష్టవంతులు!" అన్నాడు నావేపు తిరిగి

భోజనాలయిపోయినయి.

నేనూ సుభద్రా బయట అరుగుమీద కూర్చుని మాట్లాడుకొంటున్నాము. అతను ఏదో వ్రాసుకొంటున్నాడు. వెన్నెల విరగ కాస్తోంది. అంతా నిశ్శబ్దం!

"అబ్బ! ఎంత హాయిగాఉందో ఇక్కడ! కామ్‌లైఫ్!" అంది సుభద్ర. స్టేషను గడియారం నీరసంగా పదకొండు గంటలు కొట్టింది

"నాకు నిద్ర వస్తోందండీ!" అంది సుభద్ర

నేను పెడింగ్‌తెచ్చి రెండు ప్రక్కలు వరండాలో పరచాను.

అతనప్పటికీ ఇంకా ఏదో వ్రాసుకొంటూనే ఉన్నాడు.

"పాపం! మీరు మెలుకొని ఉండాలను కొంటాను!" అన్నాను.

"అలవాటయిపోయిందిలెండి. ఒకవేళ పెలవుపెట్టి ఇంటికి పోయినా రాత్రంతా నిద్రపట్టక సతమతమవుతూంటాను!" అన్నా డతను నవ్వుతూ

నామనస్సుకి అతని మాటలు అదోలా అనిపించింది "ప్రకృతికి ఎదురీత!" నేను బయటికి నడిచాను సుభద్ర అప్పటికే నిద్రపోయింది. నాకు ఎంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు వెన్నెలలో అటూ ఇటూ పచార్లు సాగించాను. గడియారం పన్నెండు కొట్టడానికి సిద్ధమవుతోంది. హఠాత్తుగా ఆగిపోయాను ఓ స్త్రీ గొంతు సన్నగా తోటివస్తున్నట్టు వినిపించింది నాకు. అది స్టేషను వెనుకవున్న ఇంటిలోనుంచి విని పిస్తోంది.

"స్టేషనూ!, స్టేషనూ, స్టేషను! అంత ప్రేమగావుంటే ఆ స్టేషన్లోని బ్లాక్ ఇన్‌స్ట్రుమెంటుకే తాళికట్టకపోయారూ? ఆ మిషన్‌తోనే కాపరం చేయకపోయారూ? నన్నెందుకు పెళ్లి చేసుకున్నారు? ఒక్కదాన్నీ అడవిలో చంపడానికా?.....పిల్లలందరూ ఒకచోట......నే నొక్కదాన్నీ బిక్కు బిక్కుమంటూ ఈ ఇంట్లో..... చెప్పండి ఇన్నేళ్ల జీవితంలో నన్నెప్పుడయినా సుఖపెట్టారా? చక్కగా మన సిచ్చి గంటసేపు మాట్లాడారా? ఎప్పుడూ రాత్రిళ్లు స్టేషనులో, పగలు ఇంట్లో నిద్రా! మిమ్మల్నని ఏం లాభం? నా రాత అలా ఏడిచింది "

వెనుకనుంచి ఎవరో నా భుజంమీద చెయ్యి వేశారు


నాగేందర్ నుంచొని ఉన్నాడు "చూడండి! మీరేమి ఖంగారు పడకండి అది ఏఏ స్టేషను మాస్టరు గారింట్లో దిన చర్య ఆయన భార్య పాపం ఈ జీవితంతో విసిగెత్తిపోయింది రోజూ ఆయనకి రాత్రిళ్లు నిద్రపట్టదు ఏదో పోట్లాడుతూంటాడు నాళ్లావిడతో!"

"కాని.. "

'కాని.. అడగండి?"

"అవన్నీ నిజాలేనా?"

"నూరుపాళ్లూ! నాకు రోజూ ఆవిడ మాటలు వింటూంటే ఏమిటో అంతా... .అయోమయంగా అంధకారంగా అనిపిస్తూంటుంది. మీరు నిద్రపొండి చాలా రాత్రయింది" అన్నా డతను వెళ్లి పోతూ.




తెల్లవారింది సుభద్ర నన్ను లేపుతూంటే మెలుకువ వచ్చింది నాకు లేచి స్టేషను లోకి నడిచాను నేను నాగేందర్ అక్కడ కనిపించలేదు. ఓ ముసలాయన అదే కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

"రండి! బాగా నిద్రపట్టిందా? నాగేందర్ మీ గురించి చెప్పాడులెండి' అన్నాడు నవ్వుతూ

"హా బాగానే నిద్రపట్టిందిలెండి! ఆయన ఏడీ?" అడిగాను

"అతను వెళ్లిపోయాడు!" అన్నాడా ఏదో వ్రాసుకొంటూ

"ఎక్కడికి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను. "మాతో ఏమీ చెప్పలేదే?"

"అవును! అతను అనుకోకుండా వెళ్ళి పోయాడు అప్పుడప్పుడు అతనికి ఒంటరి తనంమీద విరక్తి కలుగుతుంది వెంటనే బండికి ఇంటికివెళ్లిపోతాడు మళ్ళీ ఎప్పుడు వస్తాడో అతనికే తెలియదు అతనిలాగ ఉద్యోగం ఎంతోకాలం చెయ్యడని అనుమానం నాకు.... ."

నేనేమీ మాట్లాడలేదు తిరిగి వచ్చేశాను.

"మనం వెళ్లిపోదాం సుభద్రా! నా మనస్సు బాగుండలేదు!"అన్నాను నాకెందుకో నేడుండాలనిపించలేదు మరో అరగంటలో మమ్మల్నిక్కడ వదలిన రైలుబండి తిరిగి తీసుకుపోడానికి వచ్చింది ఇద్దరం బండి ఎక్కాము. కూత వేసి కదిలింది రైలు. స్టేషనుమాష్టరు చెయ్యి వూపుతున్నాడు. నాళ్లావిడ ఇంటిలోనుంచి బండి వంకే చూస్తోంది. అదే దృశ్యం కనుమరుగయేంతవరకూ చూస్తూండిపోయాను

సుభద్ర కన్నీరు తుడుచుకోవడం చూసి చకితుడనయ్యాను.

"సుభద్రా!" అన్నాను

"పాపం! ఆవిడ జీవితం! రాత్రినేనూ ఆవిడ మాటలు విన్నాను!" ●